## క్లుప్తంగా

### మధులతకు సన్మానం



సన్మానిస్తున్న చొప్పదండి ప్రకాశ్

సిరిసిల్లటౌన్: ఐఐటీలో ఆల్ ఇండియా స్థాయిలో 824వ ర్యాంకు సాధించిన వీర్నపల్లి మండలం గోన్యానాయక్ తండాకు చెందిన మధులతను గురువారం కాంగ్రెస్ నేతలు సన్మానించారు. ఆమె చదివిన ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ ఆధ్వర్యంలో సన్మానించి రూ.5వేల నగదును అందించారు. కార్యదర్శి మ్యాన ప్రసాద్, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

### కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలి

బోయినపల్లి: మధ్యాహ్న భోజన కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని సీఐటీయూ మిడ్‌డే మీల్స్ భోజనరంగ జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ముస్తాబాద్ మండలం ఆవునూర్ ప్రభుత్వ పాఠశాలలో రాగిజావను వండుతున్న క్రమంలో దురదృష్టవశాత్తు ఇద్దరు మహిళా కార్మికులకు తీవ్రగాయాలయ్యాయని తెలిపారు.ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం లేక వారు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వారికి నాణ్యమైన చికిత్స అందించాలని కోరారు.

### నేడు ఇంటర్వ్యూలు

రుద్రంగి: మండలకేంద్రంలోని కేజీబీవీలోని వసతిగృహంలో నాన్ టీచింగ్ స్టాఫ్ (అసిస్టెంట్ కుక్-01) నియమాకం కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఉదయం 11 గంటలకు మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మండల ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 7వ తరగతి పాసైన సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్స్ తమవెంట తీసుకురావాలన్నారు.

### పెండింగ్ డీఏ విడుదల చేయాలి

కోనరావుపేట: పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని అమలుచేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జంగిటి రాజు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాకు రప్పించే ఏర్పాట్లు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడో తరగతి వరకు బోధన చేస్తే ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రీ ప్రైమరీ స్కూళ్లను ప్రాథమిక పాఠశాలలోనే నిర్వహించాలని, పదివేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరుచేయాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి కొక్కుల బాలరాజు, మండల ఉపాధ్యక్షుడు గాలిపెల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


### ఆమోదయోగ్యంగా బడ్జెట్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: అన్నివర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రజాసంక్షేమ బడ్జెట్ అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోనియ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. తెలంగాణ 2024-25 వార్షిక బడ్జెట్‌ను 2,91,159 కోట్లుగా అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టి రైతులకు, పేద ప్రజలకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు గౌస్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, చెన్ని బాబు, బండారి బాల్‌రెడ్డి, గుర్రపు రాములు, మెండే శ్రీనివాస్, పద్మారెడ్డి, రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


### అనుమతులు లేకుండా పార్కింగ్



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా వాహనాలను కొందరు నిత్యం పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా బస్టాండ్‌కు వచ్చివెళ్లే బస్సులతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలతో పాటు కార్లను సైతం పార్కింగ్ చేసి వెళ్తున్నారు. దీంతో బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపై ఉండాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# సైనికుల విజయ పతాక.. కార్గిల్ లేక్

- భారతజాతి గర్వించిన వేళ..
- 22 ఏళ్ల కిందటే వైజయంతి యుద్ధ ట్యాంకర్ ఏర్పాటు
- ఏటా సిరిసిల్లలో కార్గిల్ విజయ్ దివస్



సిరిసిల్లలోని కార్గిల్‌లేక్



వైజయంతి యుద్ధ ట్యాంకర్

సిరిసిల్ల: అది 1999.. ఇండియా– పాకిస్తాన్ సరిహద్దుల్లో భీకర యుద్ధం. మన దేశ భూభాగంలోకి పాకిస్తాన్ ప్రేరేపిత చొరబాటుదారులు వచ్చారు. ఎత్తైన గుట్టలు.. మంచుపర్వతాలు.. ప్రతికూల పరిస్థితుల మధ్య మన సైనికులు వీరోచిత పోరాటం సాగించారు. ఇలా కార్గిల్ సరిహద్దుల్లో రెండు నెలల పాటు భీకరయుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో సుమారు 500 మంది మన జవానులు వీరోచితంగా పోరాడి అమరులయ్యారు. కార్గిల్ పర్వతశ్రేణులను ఆక్రమించిన పాకిస్తాన్ చొరబాటుదారుల నుంచి మన భూభాగాన్ని సైన్యం పూర్తిగా స్వాధీనం చేసుకుంది. మన సైన్యం సాధించిన విజయానికి గుర్తుగా, జవానుల త్యాగానికి చిహ్నంగా ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహిస్తారు. ఈనేపథ్యంలో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న వైజయంతి యుద్ధ ట్యాంకర్‌ను 2002లో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా సిరిసిల్ల కార్గిల్ లేక్‌పై కథనం.

**కార్గిల్ లేక్‌గా మారిన నాటి వర్థన్‌కుంట**

సిరిసిల్ల పట్టణంలోకి ప్రవేశించే దారిలోనే కార్గిల్ లేక్ ఉంది. కామారెడ్డి నుంచి వస్తుంటే.. పట్టణ ప్రవేశ ద్వారంగా వైజయంతి యుద్ధ ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. వర్థన్‌కుంటకు కార్గిల్‌లేక్‌గా 2002లో నామకరణం చేశారు. అప్పటి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి చెన్నమనేని విద్యాసాగర్ రావు, రక్షణశాఖ మంత్రి జార్జి ఫెర్నండేజ్, రక్షణ శాఖ అధికారులతో ప్రత్యేకంగా చర్చించి యుద్ధ ట్యాంకర్‌ను ఏర్పాటు చేయించేందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకున్నారు. అప్పటి మున్సిపల్ చైర్మన్ ఆడెపు రవీందర్ ట్యాంకర్ ఏర్పాటుకు గద్దె నిర్మాణం కోసం రూ.4 లక్షలు వెచ్చించారు. 40 టన్నుల బరువైన యుద్ధ ట్యాంకర్‌ను ఢిల్లీ నుంచి సిరిసిల్లకు తెప్పించేందుకు అప్పటి మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఢిల్లీకి వెళ్లి తీసుకొచ్చారు. వర్థన్‌కుంట ఇప్పుడు కార్గిల్‌లేక్‌గా మారింది.

**అభివృద్ధి అంతంతే**

కార్గిల్‌లేక్ రూపురేఖలను మార్చేందుకు.. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు బుట్టదాఖలు అయ్యాయి. 22 ఏళ్లు గడిచినా పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితమైంది. కార్గిల్ లేక్ ప్రాంతంలో ఉద్యానవనం, బోటింగ్ సదుపాయం, కుర్చీలు, విశ్రాంతి బెంచీలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కార్గిల్ లేక్ సమీపంలోనే సాయిబాబా, అయ్యప్ప ఆలయాలు ఉండడంతో పర్యాటక శోభ వస్తుందని ఆశించారు. కాగా, కార్గిల్ లేక్ అభివృద్ధికి రూ.21.10 లక్షలు కేటాయించి కొన్ని పనులు చేయగా, అభివృద్ధి అంతంతే జరిగింది.

**నేటి తరానికి స్ఫూర్తి..**

కార్గిల్‌లేక్‌పై ఏర్పాటు చేసిన యుద్ధట్యాంకర్ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తుంది. కార్గిల్ చెరువు, ఆలయాలు, రహదారి ఉండడంతో ఉద్యానవనాలను అభివృద్ధి చేస్తే బాగుంటుంది. పర్యాటక స్థలంగా మార్చితే.. పట్టణవాసులు, కొత్తగా సిరిసిల్లకు వచ్చే వారికి సైనికుల తెగువ స్ఫూర్తినిస్తుంది. కార్గిల్ యుద్ధం జరిగిన నాటి సంగతులను స్ఫురణకు తెచ్చేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ కార్గిల్‌లేక్ ఆత్మహత్యలకు వేదికగా మారింది. చెరువు కట్ట కబ్జాల కోరల్లో చిక్కింది. ఇప్పటికైనా పాలకులు స్పందించి అభివృద్ధి చేస్తే సిరిసిల్లకు అదనపు అందం దరి చేరుతుంది. కార్గిల్‌లో అమరులైన సైనికుల చిహ్నంగా సిరిసిల్లలో వైజయంతి యుద్ధ ట్యాంకర్ ప్రత్యేక ఆకర్షణగా భావితరాలకు గుర్తుండిపోతుంది.

## ఐఐటీ విద్యార్థినికి అండగా నిలిచిన కేటీఆర్

- కాలేజీ ఫీజు, ల్యాప్‌టాప్ అందజేత



దీప్తికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్

ముస్తాబాద్ : లక్ష్మీకటాక్షం లేక ఉన్నత చదువులకు వెళ్లలేని సరస్వతీ పుత్రికకు మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అండగా నిలిచారు. ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన సోమిరెడ్డి పద్మ, చంద్రం దంపతుల కూతురు సోమిరెడ్డి దీప్తి గుహవాటి ఐఐటీలో సీఎస్‌ఈ డాటా సైన్స్ ఆర్టిఫిషియల్ కోర్సులో సీటు సాధించింది. గుహవాటి ఐఐటీలో చేరేందుకు రూ.3.50 లక్షలు చెల్లించాల్సి వచ్చింది. కూలీ పనులు చేసే చంద్రం అంత మొత్తం చెల్లించలేకపోయాడు. ఐఐటీలో సీటు సాధించి వెళ్లలేకపోతున్న దీప్తి విషయాన్ని స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు కొమ్ము బాలయ్య ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో దీప్తి చదువులకు అవసరమైన రూ.3.50 లక్షలు చెల్లిస్తానని, తన పుట్టినరోజు సందర్భంగా దీప్తికి గిఫ్టఏ స్మైల్‌గా నగదు హైదరాబాద్‌లో అందించారు. అంతేకాదు ఆమెకు అవసరమైన ల్యాప్‌టాప్‌ను అందించి మానవత్వం చాటుకున్నారు. కేటీఆర్ ఔదార్యంపై గూడెం ప్రజలు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ వీరప్రసాద్

వేములవాడఅర్బన్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ శివారు బాలుర బీసీ హాస్టల్‌లోని విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థలకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

## బడ్జెట్‌పై ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న సిరికొండ శ్రీనివాస్

చందుర్తి: అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వ బడ్జెట్ ఉందని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు మానుకోవాలని బీజేపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ కోరారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తప్పుదారి పట్టించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయడం లేదన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పొంచేట్టి రాకేశ్, నాయకులు చింతకుంట గంగాధర్, చిర్రం తిరుపతి, సేరుక గంగరాజు, చింతకుంట సాగర్, నేతికుంట బాలరాజు, బొంబోతుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం



ఎల్లారెడ్డిపేట: బుగ్గరాజేశ్వర తండాలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు



వేములవాడ రూరల్: మల్లారంలో చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: నిరుపేదలకు సీఎం సహాయనిధి వరమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, మాజీ సర్పంచ్ ఆజ్మీరా రజిత అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 133 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖరీదైన వైద్యం పొందలేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అత్యవసర సమయంలో వైద్య చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్ వరంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు తిరుపతి నాయక్, దేవేందర్, రెడ్డినాయక్, తిరుపతి, కైలాస్, మోహన్, బాలు, రమేశ్, పాల్గొన్నారు.

వేములవాడ: పట్టణంలో పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు,. ఇక్కడ మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్ ముప్పిడి సునంద శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేశ్, సీనియర్ నాయకులు సూగూరి నాగభూషణం, కూర దేవయ్య, బీసీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ నాగుల రాము, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నేరెళ్ల శ్రీధర్ గౌడ్, బీసీసెల్ నియోజకవర్గం ఇన్‌చార్జి అంబటి చంద్రశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన కర్నె రాజమల్లయ్య, మల్లారం లచ్చయ్యకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో రూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, కొమ్ము రాధాకృష్ణ, శ్రీకాంత్, ఎల్లారెడ్డి, హరీశ్, అనిల్, లింగయ్య ఉన్నారు.

### చర్యలు తీసుకోవాలి

కోనరావుపేట: రిజర్వేషన్ల పితామహుడు అయిన ఛత్రపతి సాహు మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ముసుగు తీయకుండా అవమానపరుస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం మాట్లడుతూ కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో పదేళ్ల క్రితం చెరువు కట్టపైన ఛత్రపతి సాహు మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికీ విగ్రహ ముసుగు తొలగించకపోవడం ఆ మహనీయున్ని అవమానపర్చడమేనన్నారు. వెంటనే విగ్రహాన్ని ఆవిష్కరించాలని లేకుంటే దళిత, బహుజన సంఘాలను కలుపుకొని మేమే ఆవిష్కరిస్తామని హెచ్చరించారు.

### విద్యుత్ షాక్‌తో గొర్రెల మృతి



బోయినపల్లి: మండలంలోని విలాసాగర్‌కు చెందిన పోలె మల్లయ్యకు చెందిన రెండు గొర్రెలు గురువారం వరద కాలువ సమీపంలో మేత మేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి మృతిచెందాయి. దీంతో రూ.25వేలు వరకు నష్టపోయినట్లు మల్లయ్య పేర్కొన్నాడు.

### ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్న తొమ్మిది మందిపై కేసు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయం పక్కన శ్రీ రామోజీ ప్రేమల- సత్యనారాయణకు చెందిన ఖాళీస్థలంలో ఇంటినిర్మాణం కోసం బోరువేసే క్రమంలో సద్ది మద్దుల సంఘం సభ్యులు పనులను అడ్డుకున్నారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణకు తనస్థలంలో బోరు వేసుకుంటుంటే ఈ స్థలం సంఘం స్థలమంటూ బోరు వేసే వ్యక్తులను అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరించారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు గురువారం సంఘం సభ్యులు మద్దుల ఎల్లారెడ్డి, మద్దుల నారాయణరెడ్డి, బక్కయ్యగారి శ్రీను, మద్దుల నరేశ్, కోరుట్లపేట లక్ష్మారెడ్డి, చిప్పలపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొంగూరి వెంకట్‌రెడ్డి, సద్ది రాజు, మద్దుల బాలకిషన్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### వర్షానికి కూలిన ఇల్లు

చందుర్తి:మూడురోజులుగా కురుస్తున్న ముసురు వానకు మూడపల్లికి చెందిన పంబ నర్సవ్వ అనే నిరుపేద మహిళ ఇల్లు కూలింది. కూలీ చేస్తూ జీవనం సాగించే నర్సవ్వ ఇల్లు కూలడంతో సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి నర్సవ్వను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### విద్యార్థులకు అవగాహన

వీర్నపల్లి: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రత్యేకాధికారి నీలిమా ఆధ్వర్యంలో గురువారం లైఫ్‌స్కిల్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లైఫ్ స్కిల్ అధికారి అంజలి, ప్రమీల పాల్గొన్నారు.

## ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణలో వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం బీజేపీ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బీజేపీ పార్టీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, రూరల్ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, నాయకులు పిన్నింటి హన్మండ్లు, మెరుగు లక్ష్మణ్, మైలారం శ్రీనివాస్, కృష్ణ, కోల మారుతి, నేరెళ్ల సాయి, చిలువేరి బాబు, బోయిన సంపత్, నేరెళ్లకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ పూర్తయిన ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ కోరారు. దోస్త్ స్పెషల్ యాప్ ద్వారా నాలుగో విడతలో భాగంగా ప్రవేశాలకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్ మెమో, ఆధార్‌కార్డ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఓటీపీ ద్వారా కళాశాలను ఎంపికచేసుకునే అవకాశం ఉందన్నారు. ఈనెల 25నుంచి ఆగస్టు 2వరకు రిజిస్ట్రేషన్ చేసుసుకునేందుకు, 27నుంచి ఆగస్టు 3వరకు వెబ్ ఆప్షన్‌కు అవకాశం ఉందన్నారు. ఆగస్టు 6న కళాశాలల్లో సీటు అలాట్‌మెంట్ చేయనున్నట్లు తెలిపారు. సీటు వచ్చిన విద్యార్థులు ఆగస్టు 7నుంచి 9 వరకు సెల్ఫ్ రిపోర్టు చేయాలని సూచించారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తామని, ఇందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి



ముస్తాబాద్ : మాట్లాడుతున్న ఆడెపు రవీందర్

ముస్తాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని ఆపార్టీ పార్లమెంట్ ఎన్నికల కో కన్వీనర్ ఆడెపు రవీందర్ అన్నారు. మండల అర్యవైశ్య భవన్‌లో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు మేర్గు అంజాగౌడ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ స్థానాలు దక్కించుకోవాలన్నారు. ఆరు గ్యారంటీ పథకాల అమలును విస్మరించిన కాంగ్రెస్ మోసాన్ని ప్రజలకు తెలపాలన్నారు. సమావేశంలో మండలశాఖ అధ్యక్షుడు మేర్గు అంజాగౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేర్గు హన్మంత్‌గౌడ్, సిరిసిల్ల అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ యెల్ల గిరిధర్‌రెడ్డి, క్రాంతి, బాధ నరేశ్, కుడుకల జనార్ధన్, చిగురు వెంకన్న, శ్రీనివాస్‌రావు, రమేశ్ రెడ్డి, మెంగని మహేందర్, తిరుపతి, రమేశ్, గోపి, కృష్ణ, కార్తీక్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలకేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు రామచంద్రం ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం, తదితర అంశాలపై చర్చించారు. కేంద్రప్రభుత్వం ద్వారా వస్తున్న ని.దుల వివరాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, మండలాధ్యక్షుడు బైరగోని సురేశ్, బీజేపీ ప్రధాన కార్యదర్శి బొల్లారం తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు మోతుకు మోహన్, ఇన్‌చార్జి దుర్గం తిరుపతి, కుమ్మరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సైకి సన్మానం

ముస్తాబాద్: ముస్తాబాద్ ఎస్సై చిందం గణేశ్‌ను తెలంగాణ బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఎస్సైగా బాధ్యతలు చేపట్టగా సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. సంఘం అధ్యక్షుడు బద్దెపూరి శ్రీనివాస్, తిరునగరి రంగయ్య, చిట్టబోయిన కిషన్, గరిపెల్లి రమేశ్, కొంక రాజు, యాదారపు రాజు,తుమ్మ శ్రీనివాస్, కడారి వెంకటేశ్ తదితరులున్నారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర వంతెన వద్ద గురువారం ఆర్టీసీ బస్సు, ఓ ప్రైవేట్ పాఠశాల బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పడంతో ఇటు విద్యార్థులు, అటు ప్రయాణికులు ఊపిరిపీచుకున్నారు. ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ రాంగ్ రూట్‌లో వస్తూ ఆర్టీసీ బస్సును ఢీకొట్టబోయాడు. ఆర్టీసీ బస్సుడ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే సంఘటన స్థలం నుంచి స్కూల్ బస్సు డ్రైవర్ పరారయ్యాడు.

### కార్మికులకు రక్షణ కరువు ?

వేములవాడరూరల్: ఉన్న ప్రాంతంలో ఉపాధిలేక వలస వచ్చిన కార్మికులకు రక్షణ కరువైంది. కార్మికులతో పని చేయించుకుంటున్న సంబంధిత యజమానులు ప్రమాదాలు జరిగిన సమయంలో గుట్టుచప్పుడు కాకుండా వారిని సొంత రాష్ట్రాలకు పంపిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఇటీవల జరుగుతున్నా జిల్లా కార్మిక శాఖ అధికారులు కనీసం విచారణ జరపకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలోని రైస్‌మిల్‌లో బుధవారం రాత్రి బిహార్‌కు చెందిన ఓ కార్మికుడు ప్రమాదవశాతు గాయపడగా సదరు యజమాని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై పలు అనుమానాలున్నా జిల్లా కార్మిక శాఖ అధికారులు విచారణ చేపట్టలేదు. గతంలోనూ బోరుబావి తవ్వకాల్లో కూడా కార్మికులు మృతిచెందగా మృతదేహాన్ని రాత్రికిరాత్రే తరలించిన సంఘటనలున్నాయి. ఇలాంటివి సంఘటనలు జరుగుతున్నా యజమానులు బయటకు రాకుండా నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా కార్మికశాఖ అధికారులు ఇలాంటి ఘటనలపై పూర్తివిచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### సూచిక బోర్డులు ఏర్పాటు



మూడపల్లి-మర్రిగడ్డ గ్రామాల మధ్య సూచిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న ఎస్సై

చందుర్తి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మండంలోని ప్రమాదాల నివారణకు మూలమలుపులు, డేంజర్ స్పాట్‌ల్లో గురువారం సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని మూడపల్లి నుంచి లింగంపేట గ్రామం వరకు గల 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రమాద స్థలాలను గుర్తించి పోలీసులు బోర్డులను ఏర్పాటు చేయించారు.

## పూర్తికాని వంతెనల పనులు

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



మర్రిపల్లి బ్రిడ్జి వద్ద బురదలో దిగబడుతున్న వాహనాలు

వేములవాడరూరల్: వర్షాకాలంలో వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే, కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. అయినా సంబంధిత కాంట్రాక్టర్ ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో ఆ ప్రాంతం గుండా వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మర్రిపల్లి, హన్మాజిపేట గ్రామాల ప్రాంతంలో నిర్మిస్తున్న హైలెవెల్ బ్రిడ్జిలు పూర్తికాకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల ఆ ప్రాంతాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించి వర్షాకాలంలో ఈ ప్రాంతంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. అయినా సంబంధిత కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. బుధవారం రాత్రి మర్రిపల్లి ప్రాంతంలో వాహనాలు ఇరుక్కుపోవడంతో దాదాపు రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్లు వెంటనే పనులు పూర్తిచేయాలని పలుగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మర్మమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రాజన్నపేటతో పాటు అల్మాస్పూర్ గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.